
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

గురువారం 23 మే 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.169	245	279
సూర్యాపేట	రూ.170	250	280
నల్లగొండ	రూ.166	252	286

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.8 , కనిష్ఠం 25.2



కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

కొనుగోళ్లపై అప్రమత్తం

యాసంగిలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. జూన్ ఒకటో తేదీ లోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షణ చేస్తున్నారు. వేసవిలో వర్షాలు కురుస్తుండటంతో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకుంటోంది.

● ఆంధ్రజ్యోతి-యాదాద్రి

- అవకతవకలకు పాల్పడిన అధికారులకు షోకాజ్ నోటీసులు
- కొనుగోలు వేగవంతంపై క్షేత్రస్థాయికి అధికారులు
- 2.92 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- స్థలాభావంతో పక్క జిల్లాలకు ధాన్యం తరలింపు

జిల్లాలో ధాన్యానికి గ్రేడ్ నిర్ణయించడంలో వ్యవసాయ అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారు. దీంతో ముగ్గురు ఏఈవోలకు షోకాజ్ నోటీసులు జారీచేయగా, విక్రయించిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో జాప్యానికి కారణమైన చౌటుప్పల్ పీఏసీఎస్ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేశారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, సహకార శాఖల అధికారులతో పాటు మండలాల స్పెషల్ ఆఫీసర్లు టీముల పర్యవేక్షణలో కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏ, బీ గ్రేడ్ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 2.92లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించగా, మరో 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాల నుంచి ఎగుమతి చేయాల్సి ఉంది. సాయంత్రం వరకు కొనుగోలు చేసిన ధాన్యం పూర్తిగా అందుబాటులో ఉన్న మిల్లులకు, గోదాములకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వర్షం పడిన పక్షంలో ధాన్యం తడవకుండా ఉండేందుకు జిల్లాయంత్రాంగం టార్పాలిన్లను అందుబాటులోకి ఉంచింది. జిల్లాలో మొత్తం 4వేల టార్పాలిన్స్ వ్యవసాయ శాఖ గోదాముల్లో అందుబాటులో ఉంచారు. కేంద్రాల్లో లారీల అన్‌లోడింగ్, సమస్య రాకుండా ప్రత్యేకాధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల విధులకు ఆటంకం కాకుండా జూన్ ఒకటో తేదీలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

రూ.388 కోట్లు చెల్లింపు

జిల్లాలో మొత్తం 323 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో పీఏసీఎస్ 192 కేంద్రాలు, ఐకేపీ నుంచి 74,ఎఫ్‌పీవోలు 13 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మొత్తం 29,440 మంది రైతుల వద్ద 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 2,79,114 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించారు. మొత్తం రూ.620కోట్లకు ఇప్పటివరకు రూ.388.23కోట్లు చెల్లించారు. రూ.231.77 కోట్ల మేరకు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు 77 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశారు. మిగతా 246 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి రోజూ 320లారీల్లో మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు.

ఆందోళన వద్దు, మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తాం



రైతులు ఆందోళన చెందవద్దు, మొత్తం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా 4000 టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 400మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలుచేశాం. జూన్ ఒకటో తేదీలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం.మొత్తం 323 కేంద్రాలకుగాను 77 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 2.92లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.

- బెన్‌షాలోం, అదనపు కలెక్టర్

75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలింపు

జిల్లాలో రైస్‌మిల్లుల్లో, గోదాంల్లో ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేకపోవడంతో పక్క జిల్లాలకు తరలిస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని 13 మంది డిప్యూటీతహసీల్దార్లను ప్రత్యేకాధికారులు నియమించి ధాన్యం అన్‌లోడ్ ఆయ్యే వరకు పర్యవేక్షణ చేయిస్తున్నారు. మూడురోజులుగా 30వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఇతర జిల్లాలకు తరలించారు. హనుమకొండ జిల్లాకు 10వేల మెట్రిక్ టన్నులు, జనగామకు 40వేల మెట్రిక్ టన్నులు, రంగారెడ్డికి 10 వేలు, నల్లగొండకు 15వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం కొనుగో ళ్లు పూర్తయిన కేంద్రాల్లో హమాలీలను మిగతా ప్రాంతాలకు పంపించి త్వరగా మిల్లులకు తరలించేందుకు చర్య లు తీసుకుంటున్నారు. మొత్తం 39 బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లుల్లో యాసంగి 2022-23కి సంబంధించిన ధాన్యం దాదాపుగా 1.80లక్షల టన్నుల ధాన్యం, వానాకాలం ధాన్యం 2023-24కు సంబంధించిన దాదాపు 1.40 లక్షల టన్నుల వరకు నిల్వ ఉంది. యాసంగిలో ధాన్యం దాదాపు 2.20లక్షల ధాన్యం దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం రైస్‌మిల్లుల్లో దాదాపుగా 5.40లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉంది.

జిల్లాలోని 39 బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వ కెపాసిటీ దాదాపు మూడు లక్షల మాత్రమే. మిగతా 2.40లక్షల టన్నుల ధాన్యం మిల్లు ఆవరణలో, ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంల్లో నిల్వ ఉంది. మిల్లులు 10వేల టన్నుల ధాన్యం దిగుమతి చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రైవేట్ గోదాముల్లోనూ నిల్వ ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉపాధి పైసల్ పడట్లే..!

» కూలీలకు బ్యాంక్ ఖాతా కష్టాలు » కొందరికి నెలల తరబడి జమకాని వేతనాలు



మిర్యాలగూడ అర్బన్, మే 22 : సాంకేతిక సమస్య ఉపాధి కూలీలకు తలనొప్పిగా మారింది. సాఫ్ట్‌వేర్ మార్పిడి సందర్భంలో తొలగించిన జాబ్ కార్డుల్లోని కూలీలకు ప్రస్తుతం బ్యాంకు అకౌంట్ కష్టాలొచ్చిపడ్డాయి. ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్ మార్పిడి సందర్భంలో కొన్ని జాబ్‌కార్డుల అనుసం ధాన ప్రక్రియలో సాంకేతిక పరమైన సమస్య ఉత్పన్నమైంది. ఎల్లో, ఆరెంజ్, రెడ్ మార్క్‌తో ఉన్న జాబ్‌కార్డుల్లోని కూలీలకు చెందిన బ్యాంక్ అకౌంట్, ఆధార్ సీడింగ్ అప్‌డేషన్ టెక్నికల్ సిబ్బంది సరిచేయాల్సి ఉంది. అయితే రోజువారి లక్ష్యాన్ని తగ్గించుకునేందుకు రెడ్ సింబల్ వచ్చి న జాబ్‌కార్డులను తాత్కాలిక వలసల కింద తీసేసి చేసి మిగతా వాటిని 'రాగాస్' సాఫ్ట్‌వేర్ నుంచి జాబ్‌కార్డులన్నీ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌లోకి అనుసంధానం చేశారు. ఆ తర్వాతే కూలీలకు కష్టాలు వచ్చిపడ్డాయి.

సాంకేతిక సమస్యతో...

రాగాస్ నుంచి 2022లో తొలగించిన జాబ్‌కార్డులు ప్రస్తుతం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కనిపించకపోవడంతో పలు కుటుంబాలు ఉపాధిహామీ పథకానికి దూరమయ్యే అవకాశం ఉండడంతో కొత్తజాబ్‌కార్డును అందిస్తున్నారు. గతంలో ఏర్పడ్డ టెక్నికల్ సమస్యను పరిష్కరించకుండానే సాఫ్ట్‌వేర్ మార్పి చేయడంతో తొలగిపోయిన జాబ్‌కార్డులోని కూలీలకు సంబంధించిన ఆధార్, బ్యాంక్ అకౌంట్స్‌ను తిరిగి ఎన్ఐసీలో నమోదు చేయడం సాధ్యపడటం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని వందలాదిమంది కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం కూలీలు నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 12,640 జాబ్‌కార్డులు

రాగాస్ నుంచి ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ మార్పిడితో ఉమ్మడి జిల్లాలో 12,640 జాబ్‌కార్డుల్లోని సుమారు 26,380 మంది కూలీలకు బ్యాంక్ ఖాతా, ఆధార్ లింకు సమస్య ఉత్పన్నమైంది. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ఇతర పథకాల లబ్ధికోసం ఆధార్ అప్‌డేషన్ చేయించి వేలిముద్రలు, వయసు, ఐరీష్, పుట్టినతేదీల్లో చేర్పులు, మార్పులు చేయించుకున్నారు. వీరిలో కొందరు జాబ్‌కార్డులకు సాంకేతిక సమస్య ఏర్పడి తొలగింపు జాబితాలోకి వెళ్లాయి. అలాంటి కుటుంబాలకు ఈ ఏడాది తిరిగి కొత్తగా జాబ్‌కార్డులు జారీచేశారు. ఎన్ఐసీ ద్వారా జారీచేసిన జాబ్‌కార్డు నెంబర్‌కు అప్‌డేట్ చేసిన ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంకు ఖాతా నెంబర్ అథెంటిక్ వెరిఫికేషన్ చేసినప్పటికీ స్వీకరించడం లేదు. దీంతో ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఈ తరహా సమస్యతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు నుంచి పదివారాల వేతనాలు జమకావాల్సి ఉంది.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం

ఉపాధికూలీల జాబ్‌కార్డు, అకౌంట్, ఆధార్, అథంటికేషన్ వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. ప్రతీవారం చెల్లింపుల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. తమ దృష్టికి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించాం.

- నాగిరెడ్డి, డీఆర్‌డీవో పీడీ, నల్లగొండ జిల్లా

అప్‌డేట్ చేసినా అంతే..

ఉమ్మడి జిల్లాలోని ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపు ప్రక్రియను రెండు విడతలుగా చేపడుతున్నారు. మొదటిబ్యాచ్ కింద గుర్తించిన గ్రామాల్లో పనిచేసిన కూలీలకు ప్రతీ బుధవారం లోపు, రెండో బ్యాచ్ గ్రామాల్లోని కూలీలకు ప్రతీ శనివారం లోపు చేసిన పనికి కూలీ రేటు లెక్కించి పనులకు హాజరైన రోజుల పరిగనలోకి తీసుకొని వేతనాలు జమచేస్తున్నారు. ఈ ప్రక్రియ కొనసాగించే సందర్భంలో బ్యాంకు ఖాతా, ఆధార్‌లింకు సమస్యలున్న కూలీలను కంప్యూటర్ ఆపరేటర్లు గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు. సదరు కూలీలకు చెందిన బ్యాంకు ఖాతా, ఆధార్‌ను ఆప్‌డేడ్ చేయిస్తున్నప్పటికీ తిరిగి వచ్చే వారంలో అదే సమస్య ఉత్పన్నమై చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది.

ఐదు నెలల్లో రూ.18 వేల కోట్ల అప్పు

బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్



కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

భువనగిరి టౌన్, మే 22:తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో లక్షల కోట్లు అప్పులు చేస్తే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ.18వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ముంచుతోందని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కే లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి సంఘీభావంగా బుధవారం భువనగిరిలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు పక్కన పెడితే అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెడుతూ అప్పుల కోసం చేతిలో చిప్ప పట్టుకొని తిరుగుతున్నాడని విమర్శించారు. అసలే ఫిరాయింపుదారుడైన సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం ఏ పార్టీలో ఉంటాడో ఎవరికి ఎరుక అని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీని వాయిదా వేసిన ప్రభుత్వం కేవలం 10 శాతమే పండిస్తున్న సన్నాలకే రూ.500 బోనస్ ఇస్తాననడం రాష్ట్ర రైతాంగాన్ని నిట్టనిలువునా మోసగించినట్లేనని ధ్వజమెత్తారు. గ్యారెంటీ పథకాలతో పాటు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, తదితర పథకాలన్నింటినీ వాయిదా వేస్తుండడంతో రాష్ట్రంలో సాగుతోంది వాయిదాల ప్రభుత్వమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అధిష్టానానికి రూ.2వేల కోట్ల కప్పం కట్టిన సీఎం రేవంత్, గత ప్రభుత్వ అవినీతికి దర్పణాలపైన కాళేశ్వరం, ధరణి తదితర ప్రాజెక్టులపై విచారణను తూతూ మంత్రానికే పరిమితం చేయడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భువనగిరితో సహా బీజేపీకి డబుల్ డిజిడ్ సీట్లు రావడం పక్కా అన్నారు.

నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణం స్వీకారం చేస్తారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందితే రాష్ట్ర ప్రభుత్వమేమీ మారదన్నారు. బీజేపీని గెలిపిస్తే మాత్రం విద్యావంతుల సమస్యలపై, ప్రభుత్వ అవినీతిపై శాసన మండలిలో నిలదీసేందుకు ఓ గొంతుకను పంపినట్లేనని గ్రహించాలన్నారు. పట్టభద్రులకు పట్టా మినహా భద్రత లేదని, సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోతుండటంతో విద్యార్థులు తరగతి గదులకు దూరం అవుతున్నారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం, డీఎస్సీ సహా ఎలాంటి ఉద్యోగ నియామక నోటీఫికేషన్లు జారీ కాకపోవడంతో నిరుద్యోగ యువత నిర్వీర్యం అవుతోందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, పెద్దపల్లి ఎంపీ వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, పీఎల్ శ్రీనివాస్, కే జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, పాదూరి కరుణ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధి సుభాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యన్నం శివకుమార్, చందా మహేందర్ గుప్తా, ఊట్కూరు అశోక్‌గౌడ్, పార్లమెంటరీ ప్రభారి పాపారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



కలెక్టరేట్‌లో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఈసీ వికాస్ రాజ్,పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భువనగిరి అర్బన్, మే 22 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పోలీసు అధికారులతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఏర్పాట్లను సమీక్షించారు. ఇటీవలే లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున ఎమ్మెల్సీ ఎన్నికలో ఎడవ చేతి మధ్యన వేలుకు ఇంక్ మార్క్ చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలన్నారు. దీంతో పాటు ఓటర్లు తమ ఓటు ఎలా వేయాలో ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే. జెండగే, డీసీపీ ఎం. రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ పీ బెన్‌షాలోమ్, భువనగిరి, చౌటుప్పల్ ఏఆర్వోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, డీఈవో కే నారాయణరెడ్డి, చేనేత, జౌళీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విద్యాసాగర్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు అవగాహనతో ఉండాలి

పట్టభద్రుల ఉపఎన్నికలో ఓటర్లు పూర్తి అవగాహనతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతు కే. జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో ప్రతీ ఓటరూ అభ్యర్థి పేరుకు ఎదురుగా బ్యాలెట్‌తో పాటు ఈసీ అనుమతించిన వాయిలెట్ స్కెచ్ పెన్ను మాత్రమే వాడాలని తెలిపారు.

ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉన్నా బ్యాలెట్‌లో ఎదురుగా ఉన్న అంకెల రూపంలో ప్రాధాన్య క్రమంలో ఓటు వినియోగించుకోవాలన్నారు. ఒకే అభ్యర్థికి రెండు (1, 2 సంఖ్యలు) ప్రాధాన్యాలు ఇవ్వకూడదని, అభ్యర్థికి కేటాయించిన స్థలంలో మాత్రమే అంకెలు వేయాలన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్సీ ఓటు వినియోగించుకోవాలని కోరారు.

రైతులకు పంట బీమా పథకం అమలు



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

నల్లగొండ, మే 22 : ఈ వానాకాలం నుంచే రైతులకు ఉచిత పంటల బీమా పథకం అమలులోకి రానుందని హైదరాబాద్ వ్యవసాయ శాఖ కమిషనరేట్ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, నల్లగొండ జిల్లా జేడీఏ పీ శ్రవణ్‌కుమార్ అన్నారు. పంట బీమా పథకంపై బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని ఫసల్ బీమా యోజన పథకాన్ని వానాకాలం నుంచి అమలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి, టమాట, కంది పంటలకు యాసంగిలో వరి, వేరుశనగ పంటలకు ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు అటవీ జంతువులతో పంట నష్టం జరిగినా పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌బాబు, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంగీతలక్ష్మీ, సుమన్ పాల్గొన్నారు.

పూర్ణాహుతితో పరిసమాప్తి



మూడు రోజులుగా కొనసాగుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు పూర్ణాహుతితో పరిసమాప్తం అయ్యాయి. అంతకు ముందు సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించారు. రాత్రి వేళ స్వామి వారిని అలంకరించి ఊరేగించారు.

వివరాలు 7లో

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి

భువనగిరి టౌన్, మే 22 : ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అన్నారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ఫీజులు, డొనేషన్లు, విద్యా సామాగ్రి విక్రయాలతో యాజమాన్యాలు తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకాడుతుండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పాలకులు ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యావ్యవస్థను కార్పొరేట్ విద్యాసంస్థలకు అప్పగిస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని, 24, 25వ తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడ్య రాజు, వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, కాసుల నరేష్, బుగ్గ ఉదయ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ముల్కలపల్లిలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంత్ కే జెండగే

తుర్కపల్లి, మే 22 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, అదేవిధంగా సకాలంలో రైతులకు డబ్బులు చెల్లించాలని కలెక్టర్ హనుమంత్ కే జెండగే అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున మరో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ధాన్యం నాణ్యత సరిగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయిస్ మేనేజర్ గోపి కృష్ణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, తహసీల్దార్ దేశ్యానాయక్ ఉన్నారు.

జూన్ ఒకటిలోగా కొనుగోళ్లు పూర్తి చేస్తాం: అదనపు కలెక్టర్

భువనగిరి అర్బన్ :జూన్ ఒకటో తేదీలోగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాల ద్వారా 2,82,330మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 77 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తికావడంతో మూసివేశామని, మిగతా 246 కేంద్రాల్లో కొనుగోళ్లు సాగుతున్నాయన్నారు. జిల్లా సహకార, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులతో పాటు మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయన్నారు. గన్నీ సంచుల కొరత లేదని, మిల్లర్లతో తరచూ సమావేశమై దిగుమతి సమస్యలు రాకుండా చూడాలని, లారీలను త్వరగా పంపాలని, అవసరమైతే ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచేందుకు ఆదేశించారు.ఇంకా 60వేలమెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాలని త్వరలో జిల్లాలో కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు పెన్నా అనంతరామశర్మ మృతి

● తుదిశ్వాస విడిచే వరకు సీపీఎంలోనే కొనసాగిన నాయకుడు ● నల్లగొండలోని స్వగృహంలో కన్నుమూత



పెన్నా అనంతరామశర్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, మే 22: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పెన్నా అనంతరామశర్మ(90) మృతి చెందారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామగిరిలోని తన స్వగృహంలో వయోభారంతో బుధవారం రాత్రి 9 గంటలకు మృతిచెందారు. 1934వ సంవత్సరంలో నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పిట్టంపల్లిలో గ్రామంలో పెన్నా సీతయ్య, పిచ్చమ్మలకు అనంతరామశర్మ జన్మించారు. చిన్ననాటి నుంచి ప్రగతిశీల భావాలతో పెరిగిన ఆయన నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం వైపు మళ్లారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ కీలకపాత్ర పోషించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన 20 ఏట కమ్యూనిస్టు పార్టీలో చేరి పూర్తికాలం కార్యకర్తగా మారారు. సీపీఎంలో కీలక నేతగా ఎదిగారు. అంతేకాక నల్లగొండ మండలంలోని దండంపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండు దశాబ్దాలకు పైగా సేవలందించారు. సీపీఎం విస్తరణ కోసం నిరంతరం, అహర్నిశలు కృషి చేశారు. అదేవిధంగా రైతు, వ్యవసాయ, కార్మిక ఉద్యమాల్లో కీలకభూమిక పోషించారు. సీపీఎంలో ఉద్యమ నిర్మాతలైన వీఎన్, మల్లు స్వరాజ్యం, నర్రా రాఘవరెడ్డిలతో పార్టీ వ్యవహారాలతో పాటు, పోరాటాల్లో కీలకంగా వ్యవహరించారు. సీపీఎం నల్లగొండ డివిజన్ కార్యదర్శి బాధ్యతలను నిర్వర్తించారు. అంతేకాకుండా రాష్ట్ర, జిల్లా కమిటీల్లో కీలక సభ్యుడిగా ఉన్నారు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన స్వాతంత్ర్య పోరాటం, సీపీఎం వ్యవహార, పోరాటాల్లో పాల్గొని అలుపెరుగని నాయకుడిగా ఎదిగారు. మలి వయస్సులో కూడా స్వాతంత్ర్య సమరయోధుల, పింఛన్ల కోసం పోరాటం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ల సంఘం కన్వీనర్‌గా ఆయన వ్యవహరించారు.

నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతానికి చివరివరకు కట్టుబడి ఉన్నారు. ప్రజాస్వామ్యంపై అచంచెల విశ్వాసం ప్రదర్శిస్తారు. తీవ్ర వయోభారంలోనూ ఈ నెల 13వ తేదీన జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆయన తన స్వగ్రామం పిట్టంపల్లి వరకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరామశర్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతి చెందిన సమయంలో వారు ఎవరూ అందుబాటులో లేరు. కుమారుడు సింగపూర్‌లో ఉండగా, ఒకరు ఆస్పత్రిలో ఉన్నారు. కుమార్తె, కుమారుడు ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. అనంతరామశర్మ మృతిచెందిన సమయంలో పార్టీ నాయకులు అక్కడే ఉండటంతో విషయాన్ని వాళ్లకు తెలిపారు. కుమారులు, కుమార్తె వచ్చే వరకు అనంతరామశర్మ మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచనున్నట్లు బంధువులు తెలిపారు. గురువారం 9 నుంచి 11 గంటల తర్వాత సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం మృతదేహాన్ని ఉంచనున్నారు. అనంతరం స్వగ్రామమైన పిట్టంపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంతాపం తెలిపిన సీపీఎం నాయకులు

స్వాతంత్ర సమరయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పెన్నా అనంతరామశర్మ మృతి విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరామశర్మ మృతదేహంపై ఎర్రజెండాను కప్పారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, మల్లు లక్ష్మి, నారాయణ, ప్రభావతి, సయ్యద్ హాశం, సలీం, దండెపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి ఉన్నారు. అనంతరామశర్మ మృతికి మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి సంతాపం తెలిపారు.

నృసింహుడి జయంత్యుత్సవాలు పరిసమాప్తి



ప్రధానాలయంలో కలశాలు తీసుకెళ్తున్న భక్తులు

భువనగిరి అర్బన్, మే 22: సహస్ర కలశాలల్లో మంత్ర పూర్వ జలాలు.. సుగంధ పరిమళద్రవ్యాలతో భక్తి పూర్వకంగా సహస్ర కలశాభిషేకం, పూర్ణాహుతి.. రాత్రి వేళ నృసింహుడి జయంతి, ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్టితో ఉత్స పరిసమాప్తి కార్యక్రమాలతో జయంత్యుత్సవాలు ముగిశాయి. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న స్వామివారి జయంత్యుత్సవాలు బుధవారం పూజా కార్యక్రమాలతో పరిసమాప్తి అయ్యాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆగమశాస్త్రరీతిలో వెయి కళాశాలను వరుస క్రమంలో పేర్చి మంత్ర జలం, సుగంధ ద్రవ్యాలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. వేద పండితుల వేద పారాయణాలు, రుత్వికుల మంత్రోచ్చరణల మధ్య నూతన వస్త్రాలు కప్పిన కలశాల్లో పంచామృతాలు కలిపి సహస్ర కళశాభిషేక ఘట్టం నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో వేద పారాయణాలు పఠించగా నిత్య ఆరాధనల అనంతరం రుగ్వేర ద్వార యాగశాలలో ఉదయం 7గంటల నుంచి నిత్య హవనాలు, మూలమంత్ర జపాలు, మూర్తి మంత్ర పఠనాలు, లక్ష్మీసూక్తలు, విష్ణు సహస్ర పారాయణాలు 9గంటల నుంచి 9.30గంటల వరకు మహా పూర్ణాహుతి, కలశాభిషేక క్రతువుల్లో, అలాగే స్వామివారి తిరువీధి సేవలో దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతురావు దంపతులు పాల్గొన్నారు. రుత్వికులు, అర్చకులు, వేద పండితుల పారాయణాలు, ఆస్థాన విద్యాంసుల మంగళవాయిద్యాల నడుమ సాయంత్రం జరిగిన పూజల్లో నృసింహ జయంతి, ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో శాస్త్రోక్తంగా జయంతోత్సవాల్లో భాగంగా నిత్య హవనములు, మూలమంత్ర జపాలు, పూర్ణాహుతి, అష్టోత్తర శతఘటాభిషేకం పూజలు చేపట్టగా, సాయంత్రం 7గంటలకు నృసింహ జయంతి, ఆవిర్భావం, నివేదన, తీర్థ ప్రసాద గోష్టితో ఉత్సవ పరిసమాప్తి చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్క. రాయణీ నరసింహమూర్తి దంపతులు, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఉప ప్రధానార్చకుడు బట్టర్ సురేంద్రచార్యులు, మాధవచార్యులు, ఏఈవోలు దూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమేష్, గజ్వేల్లి రఘు, పర్య వేక్షకులు రాజన్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీరామ భక్త భజన, శ్రీయాదాద్రి లక్ష్మీనరసింహస్వామి మహిళ భజన మండలిలచే భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఉమ్మడి లక్ష్మణాచార్య భక్తి సంగీతం, కౌముది నృత్యాలయంచే శ్రావణీ కౌముది, శ్రీమయూరి నాట్య కళాసాధనచే రమ్య, మౌనిక కూచిపూడి నృత్యం, మధురధ్వనీ బృందంచే శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శన చేపట్టారు. కొండపైన రవీంద్ర లంగ్ కేర్ సెంటర్ డాక్టర్ ఎన్. రవీంద్ర, డాక్టర్ ప్రవళీక, కల్పన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

స్వామివారి సేవలో ఎంపీ లక్ష్మణ్

రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేశ్వర్లు, కర్రె ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అర్జిత సేవలు

నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హోమం తదితర ఆర్జీత సేవలు గురువారం పునః ప్రారంభం కానున్నాయి. స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా 9గంటలకు ప్రారంభించాల్సిన బ్రేక్ దర్శనాలు ముందస్తుగా 8.30గంటలకే ప్రారంభం కాగా 9.30గంటల వరకు బ్రేక్ దర్శనాలకు అవకాశం కల్పించారు. ఆలయ అధికారులు కూడా ఆ తర్వాత 10.30గంటలకు భక్తులకు దర్శనాలకు అనుమతించారు. సుమారు రెండు గంటలు దర్శనాల కోసం క్యూలైన్లల్లోనే ఎదురుచూశారు. లోనికి అనుమతించడంతో ఒక్కసారిగా దర్శనాల తాకిడి పెరిగిపోయింది. సెల్‌ఫోన్ ఆలయంలోకి తీసుకెళ్తానని దేవాదాయ కమిషనర్ ఎం. హనుమంతురావు వాహన డ్రైవర్ సిబ్బందితో వాగ్వాదం చేశారు. తాను కమిషనర్ డ్రైవర్‌ను తీసుకెళ్తానని మొండికేయడంతో సిబ్బంది ఫిర్యాదుతో ఆలయంలోకి సెల్‌ఫోన్లు నిషేధం విధించినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో డి. భాస్కరశర్మ నచ్చజెప్పారు.



శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. అదే విధంగా కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.35,64,770ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో నూతన వస్త్రాలు కప్పి కలశాభిషేకాలు పేర్చిన దృశ్యం

కల్యాణానికి ముస్తాబు..



కల్యాణానికి ముస్తాబైన మట్టపల్లి ఆలయం

మఠంపల్లి, మే 22: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీ నరసింహుని క్షేత్రంలో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చనలు, ద్రవిడ ప్రబంధ సేవాకాలము, మల్లికాపుష్ప సహస్ర నామార్చన, లక్ష మల్లికా పుష్ప పూజ, సాయంత్రం నాదస్వర కచేరి అనంతరం ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్లు బుధవారం వైభవంగా నిర్వహించారు. యాజ్ఞీకులు శ్రీమాన్ బొర్రావాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో శ్రీమాన్ పరాశరం వెంకటాచార్యులు, నారాయణం హరికిరణాచార్యులు బంధ్యం పాల్గొని పూజలు నిర్వహించారు. మట్టపల్లి వాసునికి పెళ్లి కొడుకు, భూదేవి, చెంచులక్ష్మీ అమ్మవార్లను పెళ్లి కూతుర్లుగా అలంకరించారు. బుధవారం అర్ధరాత్రి గురువారం తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పాలక వర్గం ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, నవీన్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు

మట్టపల్లి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం 6గంటలకు సుప్రభాతం, ప్రాతఃకాలార్చనలు, 7గంటలకు ధ్రువ స్వామివారికి పంచామృతాభిషేకము, ఉదయం 9గంటలకు రాజశేఖరుని లక్ష్మీపతి రావు దంపతులచే మల్లికాపుష్ప సహస్ర నామార్చనలు, మట్టపల్లి రామయ్య దంపతులచే మార్తి లక్ష్మీనరసింహమూర్తి, జానపాటి సీతారామశాస్త్రీ ఆధ్వర్యంలో లక్షా మల్లికా పుష్ప పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10గంటలకు ఎదుర్కోలు మహోత్సవం, సాయంత్రం 4గంటలకు నాదస్వర కచేరి, 5గంటలకు శ్రీమాన్ ముడంబై శ్రీనివాసాచార్యులు, రాఘవలక్ష్మి, మనోహర్ బృందంతో భక్తి సంగీతం, 6గంటలకు విజయవాడ వారిచే సంగీత విభావరి, రాత్రి 8గంటల నుంచి 9 గంటల వరకు ధూళిపాళ్ళ శివరామకృష్ణ భాగవతర్ గుంటూరు వారిచే గజేంద్రమోక్షము-హరికథ, రాత్రి 10గంటలకు లక్ష్మీనరసింహ నామ సంకీర్తన, రాత్రి 11గంటలకు శ్రీరామతీర్థ సేవాశ్రమము వారిచే శ్రీలక్ష్మీ నరసింహ నామ సంకీర్తనతో పాటు వీరబ్రహేంద్ర స్వామి,లక్ష్మీనరసింహ్మా, వై.ఎస్ఆర్ కోలాట బృందాలచే కోలాట ప్రదర్శన పోటీలు నిర్వహించారు. రాత్రి 12గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజలక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్లు ఉత్సవాలను వేదమంత్ర పఠనంతో సమస్త మంగళవాయిద్యాలతో కల్యాణ మం డపం వరకు వేలాదిమంది భక్తజనసంద్ర నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు.

కామాఖ్య ఆలయంలో మంత్రి ఉత్తమ్ పూజలు



హుజూర్‌నగర్, మే 22: అస్సాంలోని గౌహతిలో గల కామాఖ్య దేవాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1500 సంవత్సరాల నాటి కామాఖ్య దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. సందర్భంగా గౌహతి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రెకిబుద్దీన్ అహ్మద్ మంత్రి ఉత్తమ్ దంపతులకు స్వాగతం పలికారు. దేవాలయంలో అర్చకులచే ఆశీర్వచనాలు అందించారు.

బంగారు ఆభరణాలు దొంగతనాలు చేస్తూ..

కోదాడ, మే 22: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంతో పాటు పలు బస్ స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను కోదాడ పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కావలి మండలం బుడంగుంట గ్రామానికి చెందిన కర్రెద్దుల లలిత దొంగతనాలు చేసేది. ఈ నెల 18వ తేదీన మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహిళ కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉండగా ఆమె మెడలో ఉన్న చంద్రహారం, చెవి దిద్దులు, ముక్కుపొడుక, ఉంగరం, రూ.30వేల నగదు అపహరించింది. వాటిని కోదాడ పట్టణంలోని ఓ బంగారు ఆభరణాల దుకాణంలో బుధవారం అమ్మేందుకు తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బంగారం, నగదు, దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు రాష్ట్రాల్లో మహిళపై 50కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. పలుమార్లు జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి రూ.రెండు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోదాడ రూరల్, మే 22: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని వత్సవాయి మండలకేంద్రానికి చెందిన షేక్ సైదులు(60) రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఢీకొనడంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. సైదులు వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా ఆయన పేరు, చిరునామా కనుగొన్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ అర్బన్, మే 22: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ స్థానికంగా నివాసముంటున్న రవి కుటుంబసభ్యులు వేసవి సెలవులు రావడంతో రెండు రోజుల క్రితం తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచుకున్న రూ.30వేల నగదుతోపాటు అరతులం బంగారం, 40తులాల వెండి సామాగ్రి ఎత్తుకెళ్లారు. కుటుంబసభ్యులు బుధవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా తాళాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

తుర్కపల్లి, మే 22: కుటుంబ కలహాలతో గృహిణి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ తకీయోద్దీన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తాపురం గ్రామానికి చెందిన మొగిరెడ్డి రాజిరెడ్డికి భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌కు చెందిన స్మృతి(32)తో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరి సంసారం కొన్ని రోజులుగా సాఫీగా జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా మొగిరెడ్డి స్మృతి బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసు కొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ఎస్ఐ తెలిపారు.

'నీ కుమార్తెను కిడ్నాప్ చేశాం'

● విడిచిపెట్టాలంటే రూ.50వేలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడికి ఫోన్

చౌటుప్పల్ రూరల్ మే 22: 'నీ కుమార్తెను కిడ్నాప్ చేశాం.. రూ.50వేలు ఫోన్ పే చేస్తేనే విడిచిపెడుతాం' అంటూ ఓ మోసగాడు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఓ నాయకుడికి ఫోన్ చేసి బెదిరించాడు. సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ చిన్న కుమార్తె రుషిక ఢిల్లీలో చదువుకుంటోంది. మంగళవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అదే సమయంలో ఒక ఫేక్ వాట్సప్ కాల్ నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. మీ కూతురును కిడ్నాప్ చేశానని.. విడిచిపెట్టలంటే రూ.50 వేలు ఫోన్‌పే చేయాలని ఫోన్ కట్‌చేశాడు. దీంతో కంగారు పడిన శ్రీనివాస్ కూతరు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందాడు. కొద్ది సేపటి తర్వాత కుమార్తె రుషిక ఫోన్ చేసి తాను క్షేమంగానే ఉన్నట్టు చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నాడు. ఈ సంఘటనపై శ్రీనివాస్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

కోదాడ రూరల్, మే 22: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని యర్రవరం గ్రామంలో వెలసిన శ్రీదూలగుట్ట బాల ఉగ్ర నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం రెండో రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అష్ట కలశ స్థాపన, పంచామృత, పంచ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమాలు, నరసింహస్వామి సుదర్శన మూలమంత్ర జపాలు నిర్వహించారు. ఉదయం 11గంటలకు ముత్యాల పందిళ్ల మధ్య వేదమంత్రాలతో మంగళవాయిద్యాలతో చెంచులక్ష్మి రాజ్యలక్ష్మి సమేత నరసింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బాశబోయిన భాస్కర్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణపై ..

మండలంలోని యర్రవరం గ్రామంలో బాల ఉగ్ర నరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడంపై కొద్దిసేపు వివాదం నెలకొంది. ఆలయ ప్రారంభ సమయంలో తన కుమారుడు పందుస్వామి వాక్కు ప్రభావంతోనే ఈ దేవాలయం ఎంతో అభివృద్ధి చెందుతుందని పందుస్వామి తండ్రి సోమపంగు హుస్సేన్ అన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే స్వామివారి కల్యాణానికి తాము పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పిస్తామని, కమిటీ ఏర్పాటు సమయంలో ఒప్పందం జరిగిందన్నారు. చైర్మన్ నలజాల జగన్నాథం ఇంటి నుంచి పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు తీసుకురావడానికి నిరాకరించడంతో కొంతసేపు వివాదం జరిగింది. తాము పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించిన తర్వాతే కల్యాణం జరిపించాలని పట్టుపట్టారు. దీంతో కొంతసేపు స్వామివారి కల్యాణానికి అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఇరువర్గాలతో చర్చించిన తర్వాత అంగీకారానికి రావడంతో కల్యాణం నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

చెరువుకుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● అమ్మమ్మ ఇంటికి వచ్చి సరదాగా ఈతకు వెళ్లిన చిన్నారులు ● నల్లగొండ జిల్లా దామరచర్లలో ఘటన

దామరచర్ల, మే 22: ఈతకు వెళ్లి చెరువు కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ఇరుగు రవి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఇండ్ల నాగరాజు దామరచర్ల మండల కేంద్రంలో స్థిరపడ్డాడు. ఇళ్లలో టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడైన నాగధనుష్ (11) మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. దామరచర్ల మండల కేంద్రంలో ఈ నెల 23వ తేదీన ముత్యాలమ్మ తల్లి తిరునాళ్ల జరిగాయి. ఆ తిరునాళ్లకు పల్నాడు జిల్లా మాచవరం మండలం యామారం గ్రామానికి చెందిన నాగరాజు మరదలి కుమారుడు పెద్దిశెట్టి సాత్విక్ (8) దామరచర్లలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. దీంతో వరుసకు సోదరుడు అయిన నాగధనుష్, సాత్విక్‌లు ఇరువురు కలిసి అమ్మమ్మ ఇంటి నుంచి ఇంటి సమీపంలోని మరో ఇద్దరు బాలురతో కలిసి గ్రామ సమీపంలోని నాగులచెరువు వద్ద గల నీటికుంట వద్దకు వెళ్లారు. నాగధనుష్, సాత్విక్ ఈత కొట్టేందుకు నీటిలోకి దిగడంతో ఈత రాక ఇరువురు నీటిలో మునిగిపోయారు. దీంతో ఒడ్డున ఉన్న మరో ఇద్దరు బాలురు కేకలు వేసి సమీపంలోని వారికి చెప్పడంతో వారు నీటి కుంట వద్దకు చేరుకున్నారు. వెంటనే నీట మునిగిన ధనుష్, సాత్విక్‌లను బయటకు తీశారు. అప్పటికే నాగధనుష్ ఊపిరాడక మృతి చెందగా సాత్విక్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.



ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైన చెరువు కుంట



ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని..



ఆందోళన చేస్తున్న మహిళ

రాజాపేట, మే 22: ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని భార్య భర్త ఎదుట ఆందోళన చేసింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన రేకులపల్లి మహిపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన యువతితో 2021లో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారి 2021 జూన్ 6వ తేదీన సింహాచలం దేవస్థానంలో ఇద్దరు పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉంటూ కుటుంబ సభ్యుల సమక్షంలో మరోసారి పెళ్లి చేసుకున్నారు. యువతి నుంచి 24 తులాల బంగారం, రూ.70లక్షల నగదుతో పాటు మోత్కూరులో ఉన్న ప్లాట్లు తీసుకొని తనకున్న అప్పులు తీర్చుకున్నాడు. 15 రోజుల తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తనను మోసం చేశాడని హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. కొంతకాలంగా మహిపాల్‌రెడ్డి మొహం చాటేస్తుం డడంతో తనకు న్యాయం చేయాలని మహిపాల్‌రెడ్డి స్వగ్రామమైన బూరుగుపల్లిలోని మహిపాల్‌రెడ్డి ఇంటిముందు వంటా వార్పుతో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం నిరసన దీక్ష చేపట్టింది. మహిపాల్‌రెడ్డి తల్లి పద్మ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లడంతో తాళం వేసి ఉన్న ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్థులు, కొంతమంది నాయకులు యువతీ దీక్షకు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దీక్ష విరమింపజేసేందుకు యత్నించారు. గురువారం మహిపాల్‌రెడ్డిని రప్పించి న్యాయం చేస్తామని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో యువతి కుటుంబ సభ్యులు దీక్షను విరమించారు.

ప్రైవేట్ వ్యక్తితో విద్యుత్ లైన్ పనులు

● సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకోని సిబ్బంది ● ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ ఆఫ్ చేసి పనులు ● తీగలు సరిచేసే క్రమంలో వ్యక్తికి విద్యుదాఘాతం

గుండాల, మే 22: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది ఓ ప్రైవేట్ వ్యక్తిని స్తంభం ఎక్కించి మరమ్మతులు చేయిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... 15రోజుల క్రితం కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ లైన్ ధ్వంసమైంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో కాలనీవాసులు రెండు రోజులు క్రితం విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం లైన్ సరిచేసే క్రమంలో సిబ్బంది సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకోకుండా కాలనీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఏబీ స్విచ్ ద్వారా విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు చేస్తున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కాలనీకి చెందిన విద్యుత్ మరమ్మతుల పని తెలిసిన అన్నెపర్తి ప్రవీణ్‌ను సిబ్బంది స్తంభం ఎక్కించి విద్యుత్ లైన్ సరిచేయిస్తున్నారు. స్తంభం ఎక్కిన ప్రవీణ్ లైన్‌కు విద్యుత్ సరఫరా అవుతోందని సిబ్బందికి చెప్పాడు. తీగల నుంచి దూరంగా రావాలని అతనికి సూచించారు. ప్రవీణ్ స్తంభం నుంచి నిచ్చెన ద్వారా కిందికి దిగే సమయంలో తలకు వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గుయ్యాడు. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదే కాలనీలో మరమ్మతు పనులు జరుగుతుండడంతో కుటుంబసభ్యులు, విద్యుత్ సిబ్బంది కలిసి గాయపడిన ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం వెంటనే గ్రామంలోని ఆర్‌ఎంపీకి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. గాయపడిన ప్రవీణ్‌కు నష్టపరిహారం చెల్లించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, సీపీఎం నాయకులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి తాళం వేసి ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మోత్కూరు ఏడీఈ బాలునాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఏడీఈ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. గాయపడిన ప్రవీణ్‌కు చికిత్స చేయిస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఎండీ కలీల్, మద్దెపురం రాజు, యాదగిరి పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

కట్టంగూరు జడ్పీటీసీపై కేసు నమోదు

కట్టంగూరు, మే 22: కట్టంగూరు జడ్పీటీసీ తరాల బలరాం తన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని మండలంలో ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన తరాల మంగ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్పీటీసీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు. బాధితురాలు తరాల మంగ 2014లో తరాల బలరాం వద్ద చిట్టి వేసి ప్రారంభంలోనే చిట్టి రూ.3,38,000లు ఎత్తుకుంది. అందుకు షూరిటీగా మంగకు చెందిన అదే గ్రామంలోని సర్వేనెంబర్ 348/1లో గల ఎకరం ఐదు గుంటల భూమిని తరాల బలరాం ఆమె నుంచి ఏజీపీఏ చేయించుకున్నాడు. చిట్టి డబ్బులు వాయిదాలు పూర్తిగా చెల్లించినా కూడా ఏజీపీఏను రద్దు చేసి తన భూమి నాకు ఇవ్వకుండా, తన ప్రమేయం లేకుండానే భార్య పేరు మీదకు మార్చుకున్నాడని ఆరోపించాడు. తనను మోసం చేసిన తరాల బలరాంపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదే విషయమై జడ్పీటీసీ విలేకర్లతో మాట్లాడుతూ తాను భూమి కొనుగోలు విషయంలో చట్టపరంగానే వ్యవహరించానని తాను ఎవరినీ మోసం చేయలేదని రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని ఆరోపించారు.

మృతదేహంతో ఆందోళన

భువనగిరి అర్బన్, మే 22: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో వ్యక్తి మృతదేహంతో బుధవారం ఆందోళన చేశారు. యాదగిరిగుట్ట మండలం సైదాపురం వద్ద మంగళవారం జరిగిన బైక్ ప్రమాదంలో సాదువెల్లికి చెందిన గోలి శ్రీనివాస్(38) మృతిచెందాడు. శ్రీనివాస్ మృతికి కారణమైన యాదగిరిగుట్ట సుభాష్ నగర్‌లోని జిల్లా భరత్ ఇంటి ఎదుట మృతదేహంతో మృతుడి బంధువులు ధర్నా చేపట్టారు. యాదగిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించి శాంతింపజేశారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో భార్యా బిడ్డలు ఒంటరి వారయ్యారని బంధువులు వాపోయారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత మృతదేహాన్ని సాదువెల్లి గ్రామానికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

నేడు బుద్ధవనంలో బుద్ధ జయంతి ఉత్సవాలు

నాగార్జునసాగర్, మే 22: ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్ కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనంలో 2568వ బుద్ధ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు బుద్ధవనం అధికారులు తెలిపారు. బుద్ధ జయంతి ఉత్సవాలకు బుద్ధవనాన్ని రంగు రంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవాలకు పర్యాటక శాఖ ఎండీ రమేష్‌నాయుడుతో పాటు మైసూరుకు చెందిన బౌద్ధ భిక్షువులు, మాంక్‌లు, బౌద్ధ అభిమానులు హాజరుకానున్నట్లు బుద్ధవనం అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాలకు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉదయం 10 గంటలకు హాజరై బుద్ధుని పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకొని గురువారం బుద్ధవనంలోకి అందరికీ ఉదయం నుంచి రాత్రి వరకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.

పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలి
- ఎన్నికల కమిషనర్‌కు సర్పంచుల సంఘం వినతి

సంస్థాన్‌నారాయణపురం మే 22: తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, బిల్లులను విడుదల చేసిన తర్వాతే గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహా రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాతే గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని వారు తెలిపారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపుల్లో గత ప్రభుత్వం, తాజా ప్రభుత్వాలు జాప్యం చేస్తూ సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారన్నారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించినా కాగితానికే పరిమితమయ్యాయని అన్నారు. ఈమేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేసిన అనంతరమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు ప్రనిల్ చందర్, గుంటి మధుసూదన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సముద్రాల రమేష్, పంబ కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు

కాలనీల్లో మురుగునీరు తొలగింపు



చౌటుప్పల్‌లోని రాంనగర్‌లో మురుగు నీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

చౌటుప్పల్ టౌన్, మే 22: చౌటుప్పల్ పట్టణంలోని రాంనగర్, గణేష్ నగర్ కాలనీల్లో నిలిచిన మురుగు నీటిని బుధవారం మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులు కాలువలను శుభ్రం చేసి తొలగించారు. 'పారిశుధ్యం అస్తవ్యస్తం' అనే శీర్షికతో ఈ నెల 22న ప్రచురితమైన కథనానికి మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ ఎస్.వెంకటేశ్వర నాయక్ వెంటనే స్పందించి తగిన చర్యలను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు 13వ వార్డులోని రాంనగర్, 14వ వార్డులోని గణేష్ నగర్ ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచి దుర్గంధం ప్రబలింది. దీంతో కాలువలను శుభ్రం చేయించి, మురుగునీటిని తొలగించి వేశారు. వర్షాలకు కాలువల్లో చెత్తా చెదారం అడ్డుపడడంతో మురుగు నీరు ముందుకు వెళ్లలేక గుంతల్లో నిలిచి పోయింది. కోర్టు సమీపంలోని ఖాళీ స్థలంలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపించే విధంగా మారింది. మురుగు నీరు బయటకు వెళ్లి పోయేందుకు పారిశుధ్య కార్మికులు ప్రత్యేక కాలువలను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయ్యింది. శుభ్రం చేసిన కాలువల ద్వారా మురుగు నీరు సజావుగా ముందుకు వెళ్లి పోతుండడంతో కాలనీల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ నేతకు రాష్ట్ర కార్యదర్శి పరామర్శ



బస్వాపురంలో రాములును పరామర్శిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

భువనగిరి రూరల్, మే 22: భువనగిరి మండల సీపీఐ కార్యదర్శి ముదిగొండ రాములు సంవత్సరం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆరోగ్యం క్షీణిస్తున్న విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. బుధవారం భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చేరుకొని బాధితుడిని స్వయంగా పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఏశాల అశోక్, ఎంపీపీ నరాల నిర్మల, నాయకులు వస్తువుల అభిలాష్, గుట్ట రమేష్, దాసరి లక్ష్మయ్య, రాఘవులు, బిక్షపతి, అయిలయ్య, మల్లేశం, పెంటయ్య, భార్య ముదిగొండ లక్ష్మీ, కుమారులు, శివకుమార్, రాగూర్, కుమార్తె వెన్నెల ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి జయంతి



మత్స్యగిరి కొండపై స్వామిని అర్చిస్తున్న ఆచార్యులు



మత్స్యగిరి స్వామిని ఊరేగిస్తున్న మహిళలు

వలిగొండ, మే 22: మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో మత్స్యగిరి గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి 108 కలశాలతో పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామి వారి గర్భాలయానికి ఎదురుగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామికి లక్షపుష్పార్చన, స్వామి పల్లకి సేవ జరిపించారు. సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి మోహన్‌బాబు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం నమాత్‌పల్లిలోని స్వయంభూ శ్రీ సుదర్శన లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మ స్వాతి నక్షత్రం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గిరిప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఉపాసకులు బత్తిని రాములు గౌడ్, ఛైర్మన్ అతికం లక్ష్మీనారాయణ గౌడ్, పూజారి పవన్‌కుమార్‌శర్మ, జంగారెడ్డి, తిరుమలేష్, సుదర్శన్‌రెడ్డి, పాక జహంగీర్, వైకుంఠం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలి



రైల్వే బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మే 22: రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆలేరులో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్థానిక క్రాంతినగర్‌లో విద్యుత్ స్తంభాలను జరిపించి మోరీ మరమ్మతులు జరిపించాలన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం ఆలేరు మునిసిపాలిటీలో స్వయంగా అన్ని వార్డులూ తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరింపజేస్తామన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ మండల కార్యదర్శి సత్తయ్య

మోత్కూరు, మే 22: ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినందున ప్రభుత్వం వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అన్నారం సత్తయ్య కోరారు. బుధవారం యూటీఎఫ్ మోత్కూరు ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా పదోన్నతులు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో దునుక సోమేశ్వర్, సుబ్రమణ్య శర్మ, దడిపెల్లి శ్రీనివాస్, దోర్నం వెంకన్న, గుండా మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు సంక్షేమ పథకాలు

రామన్నపేట, మే 22: నిరుద్యోగులకోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ బాబురావు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య అన్నారు. బుధవారం రామన్నపేట పట్టణంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, సీనియర్ న్యాయవాది కాంపాటి యాదగిరి, బీజేపీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య, బండ మధుకర్ రెడ్డి, బీజేపీ నాయకులు సైదులు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ రాజు కాళభైరవ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, చీరిక సురేష్‌రెడ్డి, పనుమటి మాణిక్యంరెడ్డి, మణికంఠ ఉన్నారు.



రామన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ప్రజా సేవకోసం ఉద్యోగాన్ని త్యాగం చేసిన రాఖేష్‌రెడ్డి



భువనగిరిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి టౌన్, మే 22: ప్రజా సేవ కోసం ఉన్నత ఉద్యోగాన్ని త్యాగం చేసిన ఘనత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాఖేష్‌రెడ్డిదని మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు అన్నారు. రాఖేష్‌రెడ్డికి మద్దతుగా బుధవారం భువనగిరిలో నిర్వహించిన ప్రచారాల్లో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో ప్రశ్నించే గొంతుక కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏవీ.కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎండి.బబ్లూ, బర్రె రమేష్, నాగారం సూరజ్ సిద్దుల హరినాద్, పబ్బతి హరికృష్ణ, సుధాకర్ ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1983-84 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

చౌటుప్పల్/ చౌటుప్పల్‌టౌన్, మే 22: చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఎం.ఎస్ గార్డెన్లో బుధవారం 1983-84 ఎస్ఎస్‌సి బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. చౌటుప్పల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు బుధవారం ఒకే వేదికపై కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో అలనాటి, మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఎండి. ఇస్మాయిల్, వీరమల్ల శ్రీమన్నారాయణ, స్వామిగౌడ్, ఊడుగు వెంకటేష్‌గౌడ్, పోలోజు భాస్కరాచారి, పాశం రఘుపతి, ఎస్‌కే.జానీపాషా, రాజపేట అశోక్, బొబ్బిల్ల ధణేష్, ఉస్మాన్, జగదీష్, ముజీబ్, మహాలక్ష్మి జయమ్మ, మేనమ్మ, పద్మ, పద్మజ, సంధ్యారాణి, జ్యోతి, శోభారాణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆలేరు రూరల్: వర్షాలు పడి ధాన్యం తడవక ముందే రైతన్నల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆలేరులో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు కనకయ్య, మాటూరి జానమ్మ, శ్రీనివాస్, లక్ష్మీ, అంజనేయులు, జహంగీర్‌బీ ఉన్నారు.

రామన్నపేట: మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన చిప్పలిపల్లి మధు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన వ్యాపారవేత్త నోముల కుమార్ పిల్లల చదువు దృష్టిలో పెట్టుకొని స్థానిక యువకుల ద్వారా రూ. 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. నోముల ప్రవీణ్ కుమార్, నోముల చిరంజీవి, నోముల విష్ణు, గోపాల్, నర్సింహ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గజ్జల్లి అశోక్ ఇటీవల అకస్మాత్తుగా మరణించడంతో వారి కుటుంబానికి బుధవారం పదో తరగతి 1995-1996 బ్యాచ్ బాల్యమిత్రులు బాల్‌రెడ్డి, వెంకటేష్, ప్రభాకర్, సురేందర్, రవి, రంజిత్ కుమార్, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, పాండు, వెంకటేష్ కలిసి మృతిని కుటుంబానికి రూ.10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం ఎల్లగిరి, తూప్రాన్‌పేట ఖైలారం రోడ్డు వద్ద వెహికిల్ అండర్‌పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అండర్ పాస్ బ్రిడ్జిలు లేకపోవడంతో గ్రామస్థులు రోడ్డు ప్రమాదాలకు గురై అనేక మంది మృత్యువాత పడ్డారని క్షతగాత్రులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు బాలగోని శివ, మెట్టు భూపాల్‌రెడ్డి, గుడ్డెటి మల్లేష్, మేకల దేవేందర్‌రెడ్డి, రిక్కల మహేందర్‌రెడ్డి, గుడ్డెటి ముత్తయ్య, రిక్కల ప్రవీణ్‌రెడ్డి, కందగట్ల జంగారెడ్డి, గుడ్డెటి నర్సింహ పాల్గొన్నారు.

బీబీనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం బీబీనగర్ మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని రాఘవాపురం, రుద్రవెల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్నారు. అనంతరం పట్టభద్రుల ఎన్నికల్లో భాగంగా ఖమ్మంకు బయలుదేరి వెళ్లనున్నారు.

రామన్నపేట: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను రామన్నపేట సబ్‌డివిజన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, జిల్లా సెక్రటరీ అమర్‌నాథ్‌లు ముఖ్య అతిదులుగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 1104 యూనియన్ నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షులు అల్లె రమేష్, చౌటుప్పల్ డివిజన్ సెక్రటరీ సోమేశ్వర్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ అశోక్, జాయింట్ సెక్రటరీ యాదయ్య, జిల్లా అదనపు కార్యదర్శి తిరుమలయ్య, డిస్కం లీడర్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, భువనగిరి డివిజన్ అధ్యక్షులు షకీల్ బేగ్, రామన్నపేట సబ్ డివిజన్ లీడర్ మల్లయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఈ నెల 23న మోత్కూరు ఆర్యవైశ్య భవన్‌లో పట్టభద్రుల సమావేశం నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

అవినీతిని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- సింగిల్‌విండో ఛైర్మన్ అశోక్‌రెడ్డి



ఎంబీని చూపుతున్న సింగిల్‌విండో ఛైర్మన్ అశోక్‌రెడ్డి

మోత్కూరు, మే 22: ఇటీవల పార్టీ మారిన సింగిల్ విండో వైస్‌ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మరి కొందరు డైరెక్టర్లు తనపై అవిశ్వాసం ప్రకటిస్తూ చేసిన ఆరోపణల్లో ఏ ఒక్కటి నిరూపించినా తాను ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని మోత్కూరు సింగిల్ విండో ఛైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి సవాల్ చేశారు. బుధవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు తాను రూ.50 లక్షలు డ్రా చేశానన్న ఆరోపణలో నిజం లేదన్నారు. రూ.65 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు ఇప్పటి వరకు జరిగిన పనికి రూ.42.65 లక్షలు ఎంబీ రికార్డు అయ్యిందని, అందుకు రూ.39.13లక్షలు సంఘం నుంచి భవన నిర్మాణ కార్మికులకు చెల్లించామన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఛైర్మన్, సీఈవో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని చేసిన తీర్మాణాన్ని, పని రికార్డు చేసిన ఎంబీ బుక్‌ను ఆయన విలేకరులకు చూపించారు. వరుసగా ఐదు సమావేశాలకు హాజరు కాని డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లుకు సహకార చట్టం సెక్షన్ 21/3 ప్రకారం నోటీస్‌లు ఇచ్చి పదవి నుంచి తొలగించి డీసీవో రిపోర్టు చేశామన్నారు. డైరెక్టర్లు పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, దేవసరి రాములు ఆయన వెంట ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తుర్కపల్లి, మే 22: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని మండల ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాదాపురం, మల్కాపురం, కేశ్యాతండా గ్రామాల్లో పర్యటించి పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు సూచించారు. ప్రతీ రోజు పంచాయతీ కార్యదర్శులు పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి, ఏఈ అమరేందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ, మే 22: మండలంలోని దాసిరెడ్డిగూడెం గ్రామ గౌడసంఘం నూతన కమిటీని జిల్లా కో-ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ దశరథ పర్యవేక్షణలో బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బొడిగె అయిలయ్య, ఉపాధ్యక్షుడిగా దంతూరి దుర్గయ్య, కార్యదర్శిగా బాలగోని మల్లయ్య, డైరెక్టర్లుగా బాలగోని బిక్షపతి, దంతూరి యాదయ్య, బాలగోని సత్తయ్య, గోద అచ్చయ్య, కాటం గణేష్, బందారపు రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బాలగోని బిక్షపతి, బందారపు లింగస్వామి, దంతూరి సత్తయ్య, బాలగోని నర్సింహ, దంతూరి మల్లయ్య, బొడిగె కృష్ణస్వామి, పరమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అసిస్టెంట్ ప్రొఫెసర్ మెసేజ్‌లు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థిని.. కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, మే 22: కళశాలలో చదువుకునే విద్యార్థినికి ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ తరచూ నార్మల్ మెసేజ్‌లు పెట్టడంతో చిరాకు పడ్డ ఓ ఫార్మసీ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని(20) తూప్రాన్‌పేటలో పరిధిలోని ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. అదే కళాశాలలో వరంగల్ జిల్లాకు చెందిన అనిల్‌కుమార్ (39) అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అనిల్‌కుమార్ తన కళాశాలలో చదువుకునే విద్యార్థిని ఫోన్‌కు కొన్ని నెలల నుంచి నార్మల్ మెసేజ్‌లు పంపిస్తున్నాడు. వీటిని ఆ విద్యార్థిని అంగీకరించలేదు. ఆవిద్యార్థిని బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తేనే సమస్యలు పరిష్కారం

ఆలేరు రూరల్, మే 22: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు కౌన్సిలర్ శమంతారెడ్డి, ఎజాజ్, వెంకటస్వామి ఉన్నారు.

భువనగిరి టౌన్: కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యావంతులకు ప్రభుత్వ పక్షాన న్యాయం జరుగుతుందని మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా భువనగిరి కోర్టుతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బబ్బూరి హరినాద్‌గౌడ్, కుక్కదువ్వ కృష్ణ, నాయకులు సిద్దగోని సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

మోత్కూరు : ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం తుంగతుర్తి నియోజక వర్గం పర్యవేక్షకుడు టి.రవి కోరారు. బుధవారం ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మోత్కూరులో పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, మండల మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, మందుల సురేష్, కారుపోతుల వెంకన్న, పురుగుల నర్సింహ, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ, బయ్యని రాజు, మత్స్యగిరి పాల్గొన్నారు.



భువనగిరిలో ప్రచారం చేస్తున్న మునిసిపల్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు

ఆత్మకూరు(ఎం) : ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగుల, ప్రజాసమస్యల పట్ల అవగాహన కలిగిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు.

వలిగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య కోరారు. మండల కేంద్రంలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లింగయ్య, వెంకన్న, యాదగిరి, సుధాకర్, ఎండి ఖుర్షీద్, సత్యనారాయణ, అంజయ్య, సాయి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ గెలుపే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని రూరల్ టూరిజం సెంటర్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జరిగిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కుడికాల సుజన, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు నోముల మమత, మున్సిపల్ కౌన్సిలర్లు బోగ భానుమతి విష్ణు, మోటె రజిత రాజు, పార్టీ నాయకులు తడక రమేష్, తడక యాదగిరి, మందుల చిన్నయాదగిరి, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సీత సుధాకర్, గునిగంటి వెంకటేష్, కుక్క కుమార్, కీర్తి సంజీవ, ఎజాస్, సూరపసల్లి శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్గౌడ్, కుక్క స్వామి, మేకల రామకృష్ణ పాల్గొన్నారు.